ఐఐఎంసీలో నేడు మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష

ఖైరతాబాద్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): లక్డీకపూల్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ (ఐఐఎంసీ)లో డిగ్రీ కోర్సులు బీబీఏ, బీఎస్సీ (డేటా సైన్స్), బీకామ్, తదితర కోర్సుల్లో చేరిన, చేరగోరే ఇంటర్ విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షను గురువారం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు. తెలంగాణలోనే అతిపెద్ద మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షను మొదటిసారి నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని ఇంటర్ విద్యార్థులు సద్వినియోగం చేసుకొని రూ.5 లక్షల స్కాలర్‌షిప్‌ను పొందవచ్చునని తెలిపారు. పరీక్ష గురువారం ఉదయం 11 గంటల నుంచి 12.30 వరకు ఉంటుందని, మొదట వచ్చినవారికి ప్రాధాన్యతాక్రమంలో అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఎలాంటి రిజిస్ట్రేషన్, ఫీజు లేకుండా ఐఐఎంసీ కళాశాలలోనే పరీక్ష ఉంటుందని, ఇందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 50మంది విద్యార్థులకు రూ.5 లక్షల స్కాలర్‌షిప్ అందజేస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం ఫోన్ నం. 9989220163, 9010770605లను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

బ్రాహ్మణవాడిలో ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బేగంపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని బ్రాహ్మణవాడిలోని లేన్ నంబరు 8, బాలాజీ గ్రౌండ్ పక్కన ఉన్న సుమారు 1500 గజాల ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ స్థలాన్ని కాపాడాలని బుధవారం బాలానగర్ తహసీల్దార్ శ్రీనివాస్‌ను కలిసి బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. అయితే, ఆ స్థలం ఉన్న ప్రాంతం ఖైరతాబాద్ మండల పరిధిలోకి వస్తుందని, అక్కడ కూడా ఫిర్యాదు చేయాలని తహసీల్దార్ సూచించారు. ప్రభుత్వ స్థలాల రక్షణకు కట్టుబడి ఉన్నామని, కబ్జా కాకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు. తాహసిల్దార్‌ను కలిసిన వారిలో విజయకుమార్, చంద్రకుమార్, వెంకటచారి, సంతోష్ ముదిరాజ్, తదితరులు ఉన్నారు.

స్కూల్ బస్సుల నిర్వాహకులు భద్రతా ప్రమాణాలు పాటించాలి



స్కూల్ వ్యాన్ డ్రైవర్‌కు డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్

బంజారాహిల్స్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సుల నిర్వాహకులు భద్రతా ప్రమాణాలు పాటించాలని పశ్చిమ మండలం ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ సూచించారు. స్కూల్ బస్సుల తనిఖీలపై జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట, సంజీవరెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్కూల్ బస్సు డ్రైవర్‌లకు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ డ్రైవ్ నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. స్కూల్ బస్సు డ్రైవర్లు గీత దాటితే సహించేది లేదని హెచ్చరించారు. పోలీసులు విధించిన నిబంధనలను పాటించాలని ఆయన సూచించారు.


ఎల్బీస్టేడియంలో యోగా సాధన చేస్తున్న చింతల రామచంద్రారెడ్డి తదితరులు

20న ఎల్బీ స్టేడియంలో యోగా వేడుకలు

ఖైరతాబాద్,జూన్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 20న ఎల్బీ స్టేడియంలో యోగా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం ఎల్బీస్టేడియంలో యోగా దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను బీజేపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన స్టేడియంలో యోగా సాధన చేశారు. అనంతరం రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వేడుకలు వైభవంగా నిర్వహిస్తామని, రాజకీయాలకు అతీతంగా అందరూ పాల్గొనవచ్చునని తెలిపారు.

● మంత్రికి శుభాకాంక్షలు


కార్మిక, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన గడ్డం వివేక్ వెంకటస్వామిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నాను, వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్, నాయకులు మురహరి, జంగం రమేష్, శ్రీనివాస్, ఆంజనేయులు, నాగరాజు తదితరులు
- ఎర్రగడ్డ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి)


మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వివేక్ వెంకటస్వామిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న టీపీసీసీ కార్యదర్శి ఎం.మధుకర్ యాదవ్, తదితరులు
- ఖైరతాబాద్, జూన్ 18(ఆంధ్రజ్యోతి)

ప్రకృతి ఆయుర్వేద మందులంటూ మోసం

రాంగోపాల్‌పేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ఆయుర్వేద మందులంటూ మోసం చేస్తున్న ముఠాను రాంగోపాల్‌పేట్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు తెలిపిన వివరాల ప్రకారం.. మంజు దుర్గప్ప భగల్‌కోటి, గోవింద్ వి భగల్‌కోటి నగరంలో ప్రముఖ ఆస్పత్రుల వద్ద కాపుకాసి ఆయుర్వేద మందులతో వ్యాధులు నయం చేస్తామని అనారోగ్యంతో బాధపడుతున్న వారిని మభ్యపెడతారు. పథకం ప్రకారం కిరణ్ గోవిందప్ప శాస్త్రిగోల్, కేశవ్ భగల్‌కోటితో ఫోన్‌లో మాట్లాడిస్తారు. రోగులు నమ్మిన తర్వాత శంకర్‌మఠంలో గల ఆయుర్వేద వైద్యులు రవి శెట్టి, సురేష్ వద్దకు తీసుకెళ్తారు. మందుల పేరుతో రోగుల నుంచి రూ. లక్ష నుంచి వీలైనంత దోచుకునే వారు. ఈ నెల 13న మినిస్టర్ రోడ్డులో కిమ్స్ ఆస్పత్రికి వచ్చిన సువర్ణ(66)ను నమ్మించే ప్రయత్నం చేశారు. ఆమెకు అనుమానం వచ్చి ఆస్పత్రి భద్రతా సిబ్బందికి ఫిర్యాదు చేయగా రాంగోపాల్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంజు దుర్గప్ప భగల్‌కోటి, గోవింద్ వి భగల్‌కోటి, కిరణ్ గోవిందప్ప శాస్త్రిగోల్, కేశవ్ భగల్‌కోటిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించారు. మంజు దుర్గప్ప భగల్‌కోటిపై గతంలో మలక్‌పేట్, పంజాగుట్ట, మధురానగర్‌లలో ఇలాంటివే పలు కేసులున్నాయి. అలాగే రవి శెట్టిలపై కూడా పలు పోలీస్‌స్టేషన్‌లలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. రవి శెట్టి, సురేష్ పరారీలో ఉన్నారు.

ఆకట్టుకుంటున్న బీకేగూడ పార్కు


ప్రారంభానికి సిద్ధమైన యోగాసనాల షెడ్డు ● నూతనంగా బుక్ బాక్స్ లైబ్రరీ ఏర్పాటు


ప్రారంభానికి సిద్ధమైన యోగాసనాల షెడ్డు

అమీర్‌పేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సుగంధ వాసనలు వెదజల్లుతున్న రకరకాల పూల మొక్కలు, ఏపుగా పెరిగిన వృక్షాలు, ముచ్చట గొలుపుతున్న గ్రీనరీ, పక్షుల కిలకిల రావాలు, సేదతీరేందుకు ఏర్పాటు చేసిన బెంచీలు, ఓపెన్ జిమ్‌తో బీకేగూడ పార్కు సందర్శకులను ఆకట్టుకుంటోంది. బీకేగూడ పార్కును జీహెచ్‌ఎంసీ, ఉద్యానవన శాఖ సంయుక్తంగా సుందరీకరించాయి. ఒకప్పుడు సందర్శకులు లేక వెలవెల బోయిన ఈ పార్కు నేడు కళకళలాడుతోంది. ఉదయం 5గంటలకు మొదలుకుని సాయంత్రం 8 గంటల వరకు పిల్లలు, యువతి, యువకులు, సీనియర్ సిటిజన్ల రాకతో నిండిపోతుంది, కాలుష్యమయంగా మారిన ఈ నగరంలో స్వచ్ఛమైన గాలిని ఈ పార్కు అందిస్తోంది.

యోగా నేర్చుకునే వారి కోసం షెడ్డు

పార్కులో యోగా నేర్చుకునే వారి కోసం రూ.38 లక్షలతో నూతనంగా నిర్మించిన షెడ్డు త్వరలో ప్రారంభానికి ముస్తాబైంది. ముందెన్నడూ లేని విధంగా పాఠకుల కోసం బుక్ బాక్స్ లైబ్రరీని ఏర్పాటు చేశారు. విశాలమైన పాత్‌వేలు, ఓపెన్ జిమ్, నూతన బెంచీలు ఏర్పాటు చేశారు.



పార్కులో ఏర్పాటు చేసిన బుక్ బాక్స్ లైబ్రరీ


వాకర్స్ కూర్చునేందుకు ఏర్పాటు చేసిన బెంచీలు

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టొద్దు

ఖైరతాబాద్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని జీహెచ్‌ఎంసీ సర్కిల్ 18 (జూబ్లీహిల్స్) ఉప కమిషనర్ వి.సమ్మయ్య హెచ్చరించారు. బుధవారం సర్కిల్ పరిధిలోని జూబ్లీహిల్స్, షేక్‌పేటలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న రెండు భవనాలను టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది సీజ్ చేశారు. జూబ్లీహిల్స్ డివిజన్ జవహర్‌నగర్ కాలనీ అన్నపూర్ణ స్టూడియో లేన్‌లో ఎలాంటి అనుమతి లేకుండా చేపడుతున్న సెల్లార్, స్టిల్ట్‌తో పాటు 5 అంతస్తుల నిర్మాణంలో ఉన్న భవనాన్ని సీజ్ చేశారు. రవీందర్‌యాదవ్ పేరిట ఉన్న ఈ స్థలంలో అనుమతి లేకుండా నిర్మాణం జరుగుతోందని, వెంటనే నిలిపివేయాలని పలుమార్లు నోటీసులిచ్చినా స్పందించకపోవడంతో సీజ్ చేశామని తెలిపారు. షేక్‌పేటలో మరో అక్రమ నిర్మాణాన్ని సైతం సీజ్ చేశామని తెలిపారు. అక్రమ నిర్మాణాలపై జీహెచ్‌ఎంసీ హెల్ప్‌లైన్ నంబరు 040-21111111లో గాని, జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్‌లో గాని సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.



సీజ్ చేసిన భవనం వద్ద జీహెచ్‌ఎంసీ అధికారులు

డీఆర్‌ఎఫ్ బృందాలు 24 గంటలు అందుబాటులో ఉండాలి

ఖైరతాబాద్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్ ఉపకమిషనర్ వి.సమ్మయ్య సూచించారు. బుధవారం జూబ్లీహిల్స్ సర్కిల్ కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్, అర్బన్ బయోడైవర్సిటీ, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ తదితర విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, ముంపు ప్రాంతాలైన బస్తీల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని ఉపకమిషనర్ సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉప కమిషనర్ సమ్మయ్య

సమగ్ర ప్రకటనల విధానం తేవాలి



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఔట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేష్

పంజాగుట్ట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాదిమందికి జీవనోపాధి చూపిస్తున్న అడ్వర్టైజింగ్ పరిశ్రమలో సమగ్ర ప్రకటనల విధానం తేవాలని, ఔట్‌డోర్ అడ్వర్టైజింగ్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఔట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్(టోమో) డిమాండ్ చేసింది. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడారు. నూతన సమగ్ర ప్రకటనల విధానాన్ని రూపొందించి అడ్వర్టైజింగ్ పరిశ్రమను పరిరక్షించాలన్నారు. గత ప్రభుత్వం 2020 ఏప్రిల్ 20న జీవో 68 తీసుకువచ్చి జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని హోర్డింగ్‌లను తొలగించడంతో ప్రకటనల ఆదాయం కోల్పోయిందన్నారు. దీంతో ఏజెన్సీలకు ఉపాధి లేకుండా పోయిందని అన్నారు. 5 సంవత్సరాల కాలానికి అనుమతులు, ఏజెన్సీలకు వ్యాపార రుణాలు ఇవ్వాలని, అన్ని ఏజెన్సీలకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తమ సమస్యలు వివరిస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి రామారావు, సంయుక్త కార్యదర్శి మధు, వినోద్ కుమార్, అస్లాం, మహేష్, దయాకర్‌రెడ్డి, రామాంజనేయులు, రాజు, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.


విమాన ప్రమాదంలో మృతిచెందిన వైద్య విద్యార్థులు, ప్రయాణికులకు నివాళులర్పిస్తున్న భారత- చైనా మిత్రమండలి సభ్యులు, వైద్యులు

డాక్టర్ శాంతారాం కోట్నిస్ సేవలు చిరస్మరణీయం

పంజాగుట్ట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చైనాలో వైద్య సేవలు అందించడానికి వెళ్లి అక్కడ ప్రాణాలు కోల్పోయిన భారతీయ వైద్యుడు శాంతారాం కోట్నిస్ సేవలు చిరస్మరణీయమని భారత- చైనా మిత్రమండలి జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.మోహన్ రెడ్డి అన్నారు. భారత్- చైనా మిత్రమండలి ఆధ్వర్యంలో 11మంది సభ్యుల వైద్య బృందం ఈ నెల 9 నుంచి 15 వరకు చైనా దేశం ఆహ్వానం మేరకు బీజింగ్, గుయిజౌ రాష్ట్రంలో ఆస్పత్రులను సందర్శించిందని తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తమ అనుభవాలను పంచుకున్నారు. ముందుగా ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో మృతిచెందిన వైద్య విద్యార్థులు, ప్రయాణికులకు నివాళులర్పించారు. అనంతరం బృందం సభ్యులు మాట్లాడుతూ డాక్టర్ శాంతారాం కోట్నిస్ జ్ఞాపకార్థం వైద్య శిబిరాలు నిర్వహించామని తెలిపారు. ఇరు దేశాల మధ్య అవగాహన, మైత్రి పెంపొందాలనే ఆశయంతో 2010 నుంచి రెండు సంవత్సరాలకు ఒకసారి మిత్రమండలి ఆధ్వర్యంలో వైద్యుల బృందం చైనాలో పర్యటిస్తోందని తెలిపారు. సమావేశంలో విప్లవ కవి నిఖిలేశ్వర్, బృందం సభ్యులు డాక్టర్ ద్వారకానాథ్ రెడ్డి, డాక్టర్ జతిన్‌కుమార్, డాక్టర్ పీవీ రావు, డాక్టర్ సాయి సుధాకర్, డాక్టర్ ఎం.రాకేష్ రెడ్డి, డాక్టర్ ఎం.జయశ్రీ, డాక్టర్ సంపత్, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌పై ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదు చేయాలి

● పోలీసులకు న్యాయవాది అరుణ్‌కుమార్ ఫిర్యాదు

పంజాగుట్ట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): టెలీగ్రాఫ్ చట్టం ప్రకారం ఫోన్ ట్యాపింగ్ చేయడం, సీడీఆర్ డేటా సేకరించడం నేరమని, రాజకీయ లబ్ధి కోసం చట్టాన్ని ఉపయోగించి అధికారాన్ని దుర్వినియోగం చేసిన మాజీ సీఎం కేసీఆర్‌పై ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదు చేయాలని హైకోర్టు న్యాయవాది అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రాత్రి కేసీఆర్‌పై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగంగానే రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, సంబంధీకులు, పలువురు నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేయించిందన్నారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారానే పథకం ప్రకారం ఓటుకు నోటు కేసు నమోదు చేశారని అన్నారు. డబ్బులు తీసుకున్న వారిని ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. ఓటుకు నోటు కేసు కల్పితం అన్నారు. ఈ కేసులో రాజకీయ కుట్ర ఉందనే సుప్రీంకోర్టు చంద్రబాబునాయుడిపై కేసును కొట్టేసిందన్నారు.

కారు పార్కింగ్ విషయంలో ఘర్షణ

● న్యాయవాది కంటిపై కత్తెరతో దాడి

అమీర్‌పేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్ ముందు కారు పార్క్ చేయడంతో తలెత్తిన ఘర్షణలో ఓ యువకుడు కారు యజమానిపై కత్తెరతో దాడి చేశాడు. ఈ ఘటనలో బాధితుడికి కన్ను వద్ద తీవ్ర గాయమైంది. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేటకు చెందిన న్యాయవాది శివ(27) తన వ్యక్తిగత పని నిమిత్తం మంగళవారం కారులో బీకేగూడకు వచ్చాడు. రాత్రి 9గంటల ప్రాంతంలో కారును స్థానిక ధనలక్ష్మి అపార్ట్‌మెంట్ ముందు పార్క్ చేశాడు. దీంతో అపార్ట్‌మెంట్ కాపలాదారు శ్రీనివాస్ కారును అపార్ట్‌మెంట్ ముందు నుంచి తీయాలని చెప్పడంతో ఇద్దరి మధ్య ఘర్షణ మొదలైంది. దీంతో శ్రీనివాసుపై కారు యజమాని శివ దాడి చేశాడు. శ్రీనివాస్ భార్య శివను అడ్డుకోబోయింది. ఆమె పట్ల కూడా శివ దురుసుగా ప్రవర్తించడంతో శ్రీనివాస్ కొడుకు ఇంట్లో నుంచి కత్తెర తీసుకువచ్చి శివపై దాడి చేశాడు. ఈ సంఘటనలో శివ కంటిపై గాయమయ్యింది. బాధితుడిని అమీర్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగానే ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్యాభర్తల మధ్య గొడవ కత్తితో భార్యపై దాడి

బంజారాహిల్స్ జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య జరిగిన గొడవతో ఆగ్రహానికి గురైన భర్త కత్తితో భార్య మెడపై దాడి చేశాడు. యూసుఫ్‌గూడ శ్రీకృష్ణనగర్‌లో నివసించే అరుణ్ ప్రసాద్, జయలక్ష్మి భార్యాభర్తలు. అరుణ్ ప్రసాద్ మేఘకృష్ణ నిర్మాణ సంస్థలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. కొద్ది రోజులుగా తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. బుధవారం ఉదయం కూడా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దాదాపు రెండు గంటల పాటు ఇద్దరు వాగ్వాదానికి దిగారు. ఆగ్రహంతో ఊగిపోయిన అరుణ్ ప్రసాద్ అక్కడే ఉన్న కత్తితో జయలక్ష్మి మెడ కోశాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమెను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. జూబ్లీహిల్స్ పోలీసు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మాగంటి గోపీనాథ్‌కు ఘన నివాళి




గచ్చిబౌలిలోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో జరిగిన దశదిన కర్మ కార్యక్రమంలో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, కార్పొరేటర్లు వెల్దండ వెంకటేష్, దేదీప్యరావు, ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, తదితరులు


బంజారాహిల్స్, జూన్ 18(ఆంధ్రజ్యోతి)

బోరబండ బస్టాపు వద్ద జూబ్లీహిల్స్ దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, అభిమానులు
- బోరబండ, జూన్ 18(ఆంధ్రజ్యోతి)

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 11కేవీ నందగిరిహిల్స్, జవహర్‌నగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు 11కేవీ గుట్టల ఏజీ కాలనీ, జర్నలిస్టు కాలనీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

మరమ్మతుల కారణంగా గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు 11కేవీ సూర్యోదయ కాంప్లెక్స్, ఎన్‌బీటీ నగర్, ఫతేనగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు 11కేవీ ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, వరుణ్ టవర్స్, నెహ్రూ పార్కు ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

ఛాయాచిత్ర ప్రదర్శనకు భారీగా తరలిరావాలి

● మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పిలుపు

సికింద్రాబాద్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ సర్కారు చేసిన అభివృద్ధి, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో తాను చేపట్టిన అభివృద్ధి పనులపై 22న ఇంపీరియల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసే ఛాయాచిత్ర ప్రదర్శనకు భారీసంఖ్యలో తరలిరావాలని ఎంపీ ఈటల పిలుపునిచ్చారు. బుధవారం ఇంపీరియల్ గార్డెన్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి బీజేపీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. 11 ఏళ్లలో మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, తాను గడిచిన ఏడాదిలో చేసిన పనులను కళ్లకు కట్టినట్టుగా ఛాయాచిత్ర ప్రదర్శనలో వివరించనున్నట్టు ఆయన వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.వి.ఎస్.ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, శాంతిరెడ్డి, మాధవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సును పునరుద్ధరించాలి

రాంగోపాల్‌పేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మినిస్టర్ రోడ్డు మీదుగా బస్సును నడపాలని టీజీఎస్‌ఆర్టీసీ రాణిగంజ్ డిపో మేనేజర్ శ్రీధర్‌కు నల్లగుట్టలోని ప్రభుత్వ ఉన్న పాఠశాల(ఉర్దూ మీడియం) సిబ్బంది సురేష్‌శర్మ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయచంద్ర సూచనల మేరకు ప్రకాష్‌నగర్ నుంచి మినిస్టర్ రోడ్డు మీదుగా బస్సును నడపాలని రాణిగంజ్ డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశామన్నారు. గతంలో ఈ రూట్‌లో బస్సులు నడిపేవారని, ప్రస్తుతం పూర్తిగా నిలిపివేశారన్నారు. సికింద్రాబాద్‌లో ఉన్న ఏకైక ఉర్దూ మీడియం పాఠశాలకు ఎక్కువగా రసూల్‌పూరా, బేగంపేటలకు చెందిన పేద ముస్లిం పిల్లలు ఇక్కడ చదవడానికి వస్తుంటారని, ఈ రూట్‌లో బస్సులు నడపకపోవడం వల్ల విద్యార్థులు పాఠశాలకు రావాలంటే ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ రూట్‌లో బస్సులను నడపడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాఠశాల సిబ్బంది



రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ అభినందన సభలో మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు

రైల్వే జీఎం సేవలు మరువలేం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ద.మ.రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సేవలు మరువలేమని రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పిహెచ్ శంకర్‌రావు అన్నారు. రైల్వే జీఎం అరుణ్ కుమార్ పదవి విరమణ సందర్భంగా బుధవారం సికింద్రాబాద్‌లోని రైల్వే మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన అభినందన సత్కార సభలో ఆయన మాట్లాడుతూ రైల్వే ఉద్యోగుల సంక్షేమానికి జీఎం పెద్ద పీట వేశారన్నారు. ఇండియన్ రైల్వే సికింద్రాబాద్ జోన్ అగ్రగామిగా నిలిపారన్నారు. ఈ సందర్భంగా రైల్వే జీఎం మాట్లాడుతూ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు వ్యక్తిగత పనుల కన్నా ఉద్యోగుల సంక్షేమం కోసం ఎక్కువగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నిరాజ్ అగర్వాల్, కార్యదర్శి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ బ్రీజ్ మోహన్‌మీనా, చీఫ్ మెడికల్ డైరెక్టర్ నిర్మల రాజారామ్‌లతో పాటు పలువురు మజ్దూర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోండి

అడ్డగుట్ట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నియంత్రించేందుకు తుకారాంగేట్ చౌరస్తాలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించాలని బీజేపీ సీనియర్ నాయకుడు నర్సింగ్‌రావు, గంగరాం, సత్యనారాయణలు బుధవారం నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ తుకారాం గేట్ చౌరస్తాలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ విపరీతంగా ఉండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేస్తే ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉంటుందన్నారు. అందుకు ఏసీపీ స్పందించి కానిస్టేబుల్‌ను నియమిస్తామని తెలిపారు.



ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజ్‌ను కలిసిన బీజేపీ నేతలు

దేవాలయాల అభివృద్ధికి కృషి

తిరుమలగిరి జూన్ 18(ఆంధ్రజ్యోతి): బొల్లారం ప్రాంతంలోని దేవాలయాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తున్నామని బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ చింతల వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బొల్లారం కొత్తబస్తీ ప్రధాన రోడ్డు మార్గం ఆనుకుని ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ స్లాబ్ నిర్మాణానికి తన సొంత నిధులను వెచ్చించి బుధవారం పనులు ప్రారంభించారు. దేవాలయాలను అభివృద్ధి చేయడానికి ప్రణాళిక బద్ధంగా ముందుకు పోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర యాదవ సంఘం ఉపాధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, దేవాలయం వ్యవస్థాపకులు తదితరులు ఉన్నారు.

మేడిబావి, మైలార్‌గడ్డలో కార్పొరేటర్ పర్యటన

బౌద్ధనగర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావి, మైలార్‌గడ్డలలో బుధవారం స్థానిక కార్పొరేటర్ సామల హేమ పర్యటించి, స్థానిక మహిళల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మేడిబావిలో నూతన సీసీ రోడ్డు, రైల్వేట్రాక్ పక్కన ఉన్న గృహాలకు రిటర్నింగ్ వాల్‌ను నిర్మించాలని మహిళలు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. రిటర్నింగ్ వాల్ అంశంపై ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కారించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మైలార్‌గడ్డ బ్యాంక్ ఆఫ్ బరోడా పక్కన ఉన్న వీధిలో నల్లాల నుంచి కలుషిత నీరు వస్తుందని ఫిర్యాదు అందటంతో అధికారులతో కలిసి ఆమె అక్కడి వెళ్లారు. పైపులైన్లకు మరమ్మతులు చేపట్టిన తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీతాఫల్‌మండి జలమండలి మేనేజర్ కుషాల్, నాయకులు అనిత, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నామ్‌కే వాస్తేగా పూడికతీత!

పట్టించుకోని అధికారులు



కాచీబౌలి చికోటి కాంపౌండ్ వద్ద ప్రమాదకరంగా ఉన్న నాలా రిటైనింగ్ వాల్

రాంగోపాల్‌పేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చినప్పటికీ నాలాల్లో పూడికతీత పనులు పూర్తి కాలేదు. పూడికతీతకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదని కాలయాపన చేసి ఇప్పుడు తూతూ మంత్రంగా పూడికతీత పనులు నిర్వహించారు. అలాగే గుత్తేదారులు నాలాల్లో ఏమేరకు పూడిక తీస్తున్నారో పట్టించుకునే నాథుడే లేడు. నాలాలో మురుగు ముందుకు సాగాలంటే ఎన్నో అవరోధాలు. పూర్తి స్థాయిలో పూడిక తీయకపోవడం, చెత్త వేయడం వంటి పనులతో అవి ప్రవాహానికి అడ్డుగా మారుతున్నాయి. నల్లగుట్ట జూలమ్మ దేవాలయం వద్ద వర్షం కురిసినప్పుడు ఆ నీరు నాలాలోకి వెళ్లేలా గుత్తేదారు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉంది. కానీ తూతూ మంత్రంగా పనులు చేయడం వల్ల వర్షం పడినప్పుడల్లా నీరు నిలిచిపోతుంది. దీనికి తోడు కాచీబౌలి వద్ద అసలు పూడిక తీయనే లేదు. ఇలా అసంపూర్తి పనులు చేసే గుత్తేదారులకు బిల్లులు ఎలా మంజూరు అవుతాయోనని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అసలు ఈ నాలాలో వర్షపు నీరు మాత్రమే వెళ్లాలి. కానీ ఇందులో సీవరేజ్ పైపు లైనులు కూడా కలుపుతున్నారు. మరి జల మండలి అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు సమస్యపై దృష్టి సారించి శాశ్వత పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కాచీబౌలిలో పూడిక తీయని నాలా



జూలమ్మ ఆలయం వద్ద నాలా దుస్థితి

ప్రమాదకరంగా నాలా ప్రహరీ



కాచీబౌలిలోని చికోటి కాంపౌండ్ వద్ద నాలా ప్రహరీ ప్రమాదకరంగా ఉంది. అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. నాలాలో పూడిక తీయకపోవడం వల్ల దోమలు బాగా వృద్ధి చెందుతున్నాయి. అలాగే దుర్వాసన వెదజల్లుతోంది.

రేణు, కాచీబౌలి నివాసి

దోమలతో ఇబ్బందులు



నాలాలో పూడిక తీయకపోవడం వల్ల దోమలు వృద్ధి చెంది, ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. నాలాలో డ్రైనేజీ కనెక్షన్లు ఉన్నవారి ఇళ్లను తనిఖీ చేసి కనెక్షన్లు కట్ చేసి జరిమానాలు విధించాలి.

- జయమ్మ, కాచీబౌలి నివాసి

మెరుగైన సేవలు అందిస్తున్నాం

తిరుమలగిరి జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పౌరులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని తిరుమలగిరి మండలం తహసీల్దార్ భిక్షపతి అన్నారు. బుధవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలలు తెరుచుకున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వెంటనే కుల, నివాస, ఆదాయ ధ్రువ పత్రాలను అందజేస్తున్నామని తెలిపారు. మండల పరిధిలో రాజీవ్ యువవికాస్‌లో భాగంగా 2547 మంది దరఖాస్తు చేసుకున్నారని రూ.50వేల లోపల 101, లక్ష లోపల 110 మంది దరఖాస్తులను ఆయా అధికారులకు పంపించామని తెలిపారు.

● **ప్రభుత్వ స్థలాల పరిరక్షణ ఎలా?**

జవాబు : మండల పరిధిలో ఎనిమిది రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. అవి తోకట్ట, తిరుమలగిరి, కాకాగుడ, బోయిన్‌పల్లి, చందూలాల్ బౌలీ, మచ్చ బొల్లారం, అమ్ముగూడ, సీతారాంపురం. ఈ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నాం

● **ఇప్పటివరకు ఎన్ని ప్రభుత్వ స్థలాలను గుర్తించారు?**

జవాబు : 39 ప్రభుత్వ స్థలాలను గుర్తించాం. వీటిని ల్యాండ్‌బ్యాంక్‌లో నిక్షిప్తం చేశాం. ఎవరైనా కబ్జాకు యత్నం చేస్తే గూగుల్ మ్యాప్ ద్వారా గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాం.

● **మడ్‌ఫోర్ట్‌లోని ఉత్తరయ్య బస్తీలో సోషల్ ఎకనామికల్ సర్వే నిర్వహించారు కదా?**

జవాబు : అవును. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లబ్ధిదారులను గుర్తించడానికి సోషల్ ఎకనామికల్ సర్వే నిర్వహిస్తున్నాం. ఆ స్థలం రక్షణశాఖకు సంబంధించిన నేపథ్యంలో భూ బదలాయింపు జరిగితే వారికి ఇళ్లు కట్టించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

● **ఇప్పటివరకు ఎంత మంది లబ్ధిదారులను గుర్తించారు?**

జవాబు : సోషల్ ఎకనామికల్ సర్వే కొనసాగుతుంది. ఇప్పటికీ 500 పైచిలుకు లబ్ధిదారులను గుర్తించాం.



తహసీల్దార్ భిక్షపతి

ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు

అడ్డగుట్ట, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం సికింద్రాబాద్‌లోని పలు కూడళ్ల వద్ద ట్రాఫిక్ అదనపు డీసీపీ హరిప్రసాద్, వేణుగోపాల్‌రెడ్డి, సికింద్రాబాద్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజ్‌ల ఆధ్వర్యంలో వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. సికింద్రాబాద్‌లోని 17 ప్రాంతాల్లో లోకేషన్ డ్రైవ్ నిర్వహించారు. మొత్తం 839 వాహనాలను తనిఖీలు చేశారు. వాటిలో 288 స్కూలు బస్సులు, 297 ఆటోలు, 254 ఇతర వాహనాలు ఉన్నాయి. ఇందులో రెండు బస్సుల డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, ఓమిని బస్సుల డ్రైవర్‌లు మద్యం సేవించి వాహనం నడిపిస్తున్న 9 మందిపై కేసులు నమోదు చేశారు. అదేవిధంగా గోపాలపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు ఆటోలు, మహంకాళి ట్రాఫిక్ పరిధిలో బస్సు, రెండు ఆటోలు, ఒకటి ఓమిని; తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో, బేగంపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదైనట్లు నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు తెలిపారు.



బస్సు డ్రైవర్‌కు బ్రీతింగ్ టెస్ట్ చేస్తున్న ట్రాఫిక్ అదనపు డీజీపీ వేణుగోపాల్ రెడ్డి, హరిప్రసాద్‌లు



శానిటేషన్ డ్రైవ్ ప్రారంభించిన కార్పొరేటర్ సునీత

మెట్టుగూడలో శానిటేషన్ డ్రైవ్

చిలకలగూడ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్‌లో బుధవారం భారీఎత్తున చెత్త తరలింపు శానిటేషన్ డ్రైవ్‌ను కార్పొరేటర్ రాసూరి సునీత జెండా ఊపి ప్రారంభించారు. వివిధ శాఖల సిబ్బంది రోడ్ల పక్కన చెత్త, నిర్మాణ వ్యర్థాలు, విద్యుత్ సరఫరాకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపును చేపట్టారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే హమాల్‌బస్తీలో పర్యటించి అక్కడి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాలో ప్రెజర్ తక్కువగా వస్తోందని, నీటి సరఫరా వేళలు సరిగా పాటించడంలేదని ఫిర్యాదు చేయగా, సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.



ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎనిమిదో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పవన్‌కుమార్ గౌడ్

ఐక్యతను చాటి హక్కులు సాధించుకోవాలి

మారేడుపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 24న జరగబోయే ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమసంఘం 8వ మహాసభ పోస్టర్‌ను బుధవారం సంఘం హైదరాబాద్ జోన్ గౌరవ అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలందరూ ఐక్యంగా, సంఘటితమైతే హక్కులను సాధించుకోవడం సులభతరం అవుతుందని అన్నారు. ఈ సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బీర్ల ఐలయ్య, ఆర్టీసీ ఎండీ కూడా హాజరు కానున్నారని ఆయన తెలిపారు. సమావేశానికి సంఘం ప్రధాన కార్యదర్శి నిరంజన్ అధ్యక్షత వహించగా తిరుపతయ్య, వెంకటేష్, మాధర్, కృష్ణ, రేణుక, సృజన, మంగమ్మలు పాల్గొన్నారు.

నకిలీ వైద్యుడిపై కేసు నమోదు

బోయినపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లోని బోయినపల్లి హస్మత్‌పేట్‌లోని శ్రీసాయి మారుతి క్లినిక్ పేరుతో పులిగిల్ల నాగేందర్ అనే వ్యక్తి నకిలీ క్లినిక్ నిర్వహిస్తున్నాడు. బోయినపల్లి ఎస్‌ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు సికింద్రాబాద్‌లోని ఓ కార్పొరేట్ ప్రైవేట్ ఆసుపత్రిలో వార్డ్‌బాయ్‌గా పని చేస్తున్నాడు. అదే అనుభవంతో వైద్యుడని నమ్మించి పలువురికి నకిలీ వైద్యం చేస్తున్నాడనే సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి పోలీసులు రెండు రోజుల క్రితం క్లినిక్‌లో తనిఖీలు చేయగా నకిలీ వైద్యుడని తేలిందని ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో హాజరుపరిచి సదరు నకిలీ వైద్యుడిని రిమాండ్‌కు తరలించారు. కాగా మూడు రోజుల క్రితం బొల్లారంలో ఇలాంటి నకిలీ వైద్యుల నిర్లక్ష్యమైన వైద్యంతో ఓ జిమ్ కోచ్ మృతి చెందడం జరిగింది. ఇలాంటి క్లినిక్‌లపై దృష్టి పెట్టిన పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఈ నకిలీ వైద్యుడు బయటపడినట్లు పోలీసులు వెల్లడించారు.

బ్రాహ్మణవాడిలో ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

బేగంపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని బ్రాహ్మణవాడిలోని లేన్ నంబరు 8, బాలాజీ గ్రౌండ్ పక్కన ఉన్న సుమారు 1500 గజాల ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ స్థలాన్ని కాపాడాలని బుధవారం బాలానగర్ తహసీల్దార్ శ్రీనివాస్‌ను కలిసి బీజేపీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. అయితే, ఆ స్థలం ఉన్న ప్రాంతం ఖైరతాబాద్ మండల పరిధిలోకి వస్తుందని, అక్కడ కూడా ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రభుత్వ స్థలాల రక్షణకు కట్టుబడి ఉన్నామని, కబ్జా కాకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు. తాహసీల్దార్‌ను కలిసిన వారిలో విజయకుమార్, చంద్రకుమార్, వెంకటచారి, సంతోష్ ముదిరాజ్‌లు ఉన్నారు.

ప్రకృతి ఆయుర్వేద మందులంటూ మోసం.. ముఠా సభ్యుల అరెస్ట్

రాంగోపాల్‌పేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ఆయుర్వేద మందులంటూ మోసం చేస్తున్న ముఠాను రాంగోపాల్‌పేట్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు తెలిపిన వివరాల ప్రకారం.. మంజు దుర్గప్ప భగల్‌కోటి, గోవింద్ వి భగల్‌కోటి నగరంలో ప్రముఖ ఆస్పత్రుల వద్ద కాపుకాసి ఆయుర్వేద మందులతో వ్యాధులు నయం చేస్తామని అనారోగ్యంతో బాధపడుతున్న వారిని మభ్యపెడతారు. పథకం ప్రకారం కిరణ్ గోవిందప్ప శాస్త్రిగోల్, కేశవ్ భగల్‌కోటితో ఫోన్‌లో మాట్లాడిస్తారు. రోగులు నమ్మిన తర్వాత శంకర్‌మఠంలో గల ఆయుర్వేద వైద్యులు రవి శెట్టి, సురేష్ వద్దకు తీసుకెళ్తారు. మందుల పేరుతో రోగుల నుంచి రూ. లక్ష నుంచి వీలైనంత దోచుకునే వారు. ఈ నెల 13వ తేదీన మినిస్టర్ రోడ్డులో కిమ్స్ ఆస్పత్రికి వచ్చిన సువర్ణ (66) అనే వృద్ధురాలిని నమ్మించే ప్రయత్నం చేశారు. ఆమెకు అనుమానం వచ్చి ఆస్పత్రి భద్రతా సిబ్బందికి ఫిర్యాదు చేయగా రాంగోపాల్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంజు దుర్గప్ప భగల్‌కోటి, గోవింద్ వి భగల్‌కోటి, కిరణ్ గోవిందప్ప శాస్త్రిగోల్, కేశవ్ భగల్‌కోటిను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించారు. మంజు దుర్గప్ప భగల్‌కోటిపై గతంలో మలక్‌పేట్, పంజాగుట్ట, మధురానగర్‌లలో ఇలాంటివే పలు కేసులున్నాయి. అలాగే రవి శెట్టిలపై కూడా పలు పోలీస్‌స్టేషన్‌లలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. రవి శెట్టి, సురేష్ పరారీలో ఉన్నారు.



బౌద్ధనగర్ బీజేపీ కార్యాలయంలో విద్యార్థికి ఆర్థికసహాయం అందజేసిన రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు సాయిప్రసాద్‌గౌడ్

పేద విద్యార్థికి ఆర్థికసాయం

బౌద్ధనగర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఓ పేద విద్యార్థికి చదువు నిమిత్తం బీజేపీ నాయకులు రూ.30వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అంబర్‌నగర్‌కు చెందిన గౌతమ్ స్థానిక ప్రైవేట్ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. ఆర్థికంగా వెనుకబడి ఉన్న గౌతమ్ చదువు నిమిత్తం సాయిగౌడ్ కింగ్స్ డ్రైవ్ ఇన్ సహకారంతో బుధవారం బౌద్ధనగర్ బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్, స్థానిక డివిజన్ అధ్యక్షుడు సాయిప్రసాద్ గౌడ్, మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్‌లు గౌతమ్‌కు అందజేశారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

బౌద్ధనగర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ కలిసి వినతి పత్రం సమర్పించారు. సీతాఫల్‌మండి డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. భవానీనగర్ నుంచి మహ్మద్‌గూడ వరకు నాలా పునర్నిర్మాణ పనులకు 2022 జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో నిధులు మంజూరయ్యాయని, ఇప్పటివరకు ఈ ప్రాజెక్ట్ అమలు కాలేదని కార్పొరేటర్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే డివిజన్‌లో నిధులు మంజూరు కాకపోవటంతో పలు అభివృద్ధి నిలిచిపోయాయని తెలిపారు.




జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను కలిసి వినతి పత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ సామల హేమ



డిప్యూటీ ఐఓఎస్ అధికారి మధన్‌మోహన్‌రెడ్డికి బాల కార్మికుల జాబితాను అందజేస్తున్న తల్లుల సంఘం ప్రతినిధులు

డిప్యూటీ ఐఓఎస్‌కు బాల కార్మికుల జాబితా అందజేత

అడ్డగుట్ట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మారేడుపల్లి మండలంలో బాల కార్మికుల జాబితాను తయారు చేసి మారేడుపల్లి విద్యాశాఖ డిప్యూటీ ఐఓఎస్ అధికారి మదన్‌మోహన్‌రెడ్డికి బుధవారం బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి సిహెచ్ లక్ష్మినారాయణ, తెలంగాణ తల్లుల సంఘం తెలంగాణ తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్య, బాలల హక్కుల పరిరక్షణ వేదిక కో-కన్వీనర్ సువర్ణ, జిల్లా కో-ఆర్డినేటర్ నక్కల శోభ, ప్రవీణ్ కుమార్ ప్రతినిధులు అందజేశారు.



నూతన కమిటీ ఎన్నిక

లాలాగూడలోని రామాలయానికి ఆదం భరత్ ఆధ్వర్యంలో బుధవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా రాజారావు, ధర్మకర్తలుగా జగదీష్ కుమార్, సంతోషాచారి, శంకర్‌రావు, శివకుమార్, శ్రీనివాస్, శైలజలు నియమితులైయ్యారు.

- అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి



మంత్రికి శుభాకాంక్షలు

మైనింగ్ ఉపాధి కార్మికశాఖ మంత్రిగా గడ్డం వివేక్ వెంకటస్వామి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జై భీమ్ సేన రైట్ టూ ఫైట్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బల్వంత్, షెడ్యూల్ కులాల పరిరక్షణ హక్కుల సమితి సికింద్రాబాద్ పార్లమెంటరీ మీడియా కన్వీనర్ పాకనాటి జయకుమార్, గ్రేటర్ కార్యదర్శి కొమ్మర క్రాంతి కుమార్‌లు కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువా కప్పి అభినందించారు.

- అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి